సాక్షి
జోగులాంబ గద్వాల
గురువారం । 11 । మే । 2023



క్రీడాహబ్‌గా పాలమూరు
స్టేడియం నిర్మాణాలతో పాలమూరు క్రీడల హబ్‌గా మారనుంది.
వివరాలు 8లో ▸



ఉల్లి రైతుల నిరాశ
దేవరకద్ర మార్కెట్‌యార్డులో బుధవారం జరిగిన ఉల్లి వేలం రైతులను నిరాశపర్చింది.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
38.3 /26.2

వాతావరణం
ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత తప్పదు. స్వల్పంగా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మల్బరీ తోటల పెంపకానికి ప్రోత్సాహకం

గద్వాల వ్యవసాయం: 2023–24 ఆర్థిక సంవత్సరాని గాను సిల్క్ సమగ్ర పథకం కింద మల్బరీ తోటల పెంపకానికి ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జిల్లాకు 70 యూనిట్లు కెటాయించిందని, జనరల్ కెటగిరీ రైతులకు ప్రభుత్వ వాటా 50శాతం షెడ్ నిర్మాణం కోసం సబ్సిడీ రూ. 2.25లక్షలు, 2ఎకరాల తోట నిర్వహణ, నీటి వసతి కోసం రూ.1.10లక్షలు, కిసాన్ నర్సరీకి రూ. 75వేలు ఉంటుందని తెలిపారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ కెటగిరీ రైతులకు ప్రభుత్వ వాటా 65శాతం, షెడ్ నిర్మాణం కోసం సబ్సిడీ రూ.2.92లక్షలు, 2ఎకరాల తోట నిర్వహణ, నీటి వసతి కోసం రూ.1.43లక్షలు, కిసాన్ నర్సరీకి రూ.97500 ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆర్‌ఓఆర్, కుల ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుబుక్ జిరాక్స్ పత్రాలతో పాటు, పాస్ పోర్ట్ సైజు ఫొటోతో దరఖాస్తులు అందించాలని, మరిన్ని వివరాలకు జనార్దన్ పట్టు పరిశ్రమ అధికారి సెల్. 7997725199, శ్రీనివాసచారి గద్వాల ఉద్యాన అధికారి సెల్. 7997725197, రాజశేఖర్ అలంపూర్ ఉద్యాన అధికారి సెల్. 7997725198, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి 7997725196లను సంప్రదించాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



ఎర్రవల్లిచౌరస్తా: రైతులకు ప్రభుత్వ గుర్తింపు పొందిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని ఏడీఏ సక్రియానాయక్ సూచించారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలోని పలు సీడ్, ఎరువుల షాపులలో టాస్క్‌ఫోర్స్ అధికారి నాగేశ్వరావుతో కలిసి ఏడీఏ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా షాపులలోని వివిధ కంపెనీలకు చెందిన పత్తి, మిరప విత్తనాలను, ఎరువులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వ అనుమతులు గల విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని అన్నారు. షాపులో విక్రయించే ప్రతి కంపెనీకి చెందిన పీసీలను, ఓపామ్ లను లైసెన్స్‌లో తప్పకుండా నమోదు చేయించుకోవాలని తెలిపారు. ప్రతి రైతుకు కూడా విత్తనాలు, ఎరువులతో పాటు పురుగుమందు కొనేటప్పుడు తప్పనిసరిగా సంబంధిత షాపునకు చెందిన ఒరిజినల్ రశీదులు ఖచ్చితంగా ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించరాదని, కాలం చెల్లిన సీడ్, ఎరువులు, పురుగు మందులను అమ్మితే అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏఓ అయూబ్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

మల్దకల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ ఉమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని కుర్తిరావల్‌చెర్వులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో కూలీలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపాధి పనులు చేయాలని పేర్కొన్నారు. నేమ్‌బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, జాబుకార్డులు లేని కూలీలందరికి జాబుకార్డులు అందించి ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ స్వామి పాల్గొన్నారు.

జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి

గద్వాల అర్బన్: జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎండీపీఓ కార్యాలయం వద్ద జేపీఎస్, ఓపీఎస్‌లు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 13వ రోజుకు చేరింది.ఈ సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. సీఎం కేసీఆర్ జేపీఎస్‌లు, ఓపీఎస్‌లకు గ్రేడ్–4 ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలన్నారు. ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా గుర్తించి, రెగ్యులర్ చేయాలని, మృతిచెందిన పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు రూ.20లక్షల పరిహారం, కారుణ్య నియమకాలు చేపట్టాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి మద్దతు తెలిపారు.

పేదింటి బిడ్డ అయితేనేం..



కుటుంబ సభ్యులతో అల్తాఫ్

తల్లిదండ్రులు చెప్పిన ధైర్యం.. ఉపాధ్యాయుల ప్రోత్సాహం.. పదో తరగతి పరీక్షల్లో పదికి పది జీపీఏ సాధించేందుకు దోహదపడ్డాయని పేర్కొన్నాడు అలంపూర్ మండలం భీమవరానికి చెందిన గురుకుల విద్యార్థి అల్తాఫ్. ఇతను గద్వాల గురుకుల పాఠశాల (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్)లో 5వ తరగతి నుంచి చదువుతున్నాడు. తండ్రి నజీర్ అహ్మద్ ఐస్‌క్రీమ్ అమ్ముతూ, తల్లి వ్యవసాయ కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించేవారు. నలుగురి సంతానంలో పెద్దవాడు అల్తాఫ్. తమ్ముళ్లు, చెల్లి సైతం గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను నిత్యం సాధన చేయడం, తరచూ గ్రాంట్ టెస్టులు రాయడం, సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటూ పాఠ్యాంశాలపై పట్టు సాధించానని అల్తాఫ్ పేర్కొన్నాడు. ఇంటర్మీడియేట్ కోసం కరీంనగర్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) గురుకుల కళాశాలకు ఎంపికయ్యాడు.



ఉత్తీర్ణత పెరిగినా.. ర్యాంకు దిగదుడుపే!

- 80.70శాతం ఉత్తీర్ణత.. బాలికలదే పైచేయి
- బాలికలు 83.89 శాతం, బాలురు 77.42 శాతం ఉత్తీర్ణత

27వ స్థానంలో జిల్లా

గద్వాల: పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయారు. అయితే ఉత్తీర్ణతశాతం పెరిగినా.. రాష్ట్ర స్థాయి ర్యాంకులో మాత్రం వెనకబడింది. బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జోగుళాంబ గద్వాల జిల్లా 27వ స్థానంతో సరిపెట్టుకోవడం తీవ్ర నిరాశ కల్గించింది. గతంలో రాష్ట్రస్థాయిలో ఓ మధ్యస్థంగా ఉన్న జిల్లా ర్యాంకు ఈ సారి చతికిలపడింది. జిల్లా వ్యాప్తంగా 7,175 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 5,790 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లా సరాసరి ఉత్తీర్ణత 80.70 శాతంగా నమోదైంది. వీరిలో 3,538 మంది బాలురకు.. 2,739 మంది ఉత్తీర్ణత సాధించి 77.42 శాతంతో సరిపెట్టుకున్నారు. 3,637 మంది బాలికలు పరీక్షలు రాయగా 3,051 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 83.89 శాతంతో బాలుర కంటే కొంత పైచేయి సాధించారు. అక్షరాస్యతలో వెనకంజలో ఉన్న ఈ జిల్లాలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధించినప్పటికీ సర్దుబాటుతో వాటిని భర్తీ చేయగలిగారు.

'పది'ంతల కారణాలు..

- 2019–20, 2020–21 విద్యా సంవత్సరాల్లో పరీక్షలు లేకుండానే అందరనీ ఉత్తీర్ణులుగా ప్రకటించారు. తరువాత వచ్చిన ఏడాదిలో ఓ మోస్తారుగా మంచి ఉత్తీర్ణతే సాధించారు. ప్రస్తుత ఏడాది పరీక్షల నిర్వహణలో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు అదనపు తరగతులు, భూమిక, రీడ్ తదితర కార్యక్రమాలను అమలు చేసినా ఆశించిన ఫలితం ఇవ్వలేదు. రాష్ట్రస్థాయి ర్యాంకులో జిల్లా వెనకబడింది.
- చదువులో వెనకబడిన విద్యార్థులు ప్రత్యేక తరగతులు నిర్వహించినా అనేక మంది గైర్హాజరయ్యారు. కొన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ వహించలేదు. పరీక్ష పేపర్లను 11 నుంచి ఆరుకి కుదించినా పూర్తిగా కలిసి రాలేదు.
- ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, 317జీవో అంటూ చాలా రోజులు ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. దీంతో చాలా పాఠశాలలో చదువులపై అంతగా శ్రద్ధ చూపకపోవడమూ వెనుకబాటుకు కారణంగా కనిపిస్తోంది.
- పరీక్షల సమయంలో డీఈఓ వారంలో రెండు, మూడు రోజులు, ఎంఈఓలు నిత్యం పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయ బోధన, విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించాల్సి ఉంది. అందుకు అనుగుణంగా సూచనలు, ఆదేశాలు జారీ చేయాలి. ఒక్కో ఎంఈఓకు రెండు, మూడు మండలాలు ఇన్‌చార్జి బాధ్యలు అప్పగించడంతో సరైన పర్యవేక్షణ లేకుండా పోయింది. రాజకీయ ఒత్తిళ్లతో నిర్లక్ష్యంగా ఉన్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోలేకపోయారు.

జిల్లాలో పదో తరగతి ఫలితాలు ఇలా...			
విద్యా సంవత్సరం	మొత్తం విద్యార్థులు	ఉత్తీర్ణులైన విద్యార్థులు	ఉత్తీర్ణత శాతం
2016-17	6,763	5,376	79.49
2017-18	7,200	5,483	76.15
2018-19	7,521	6540	86.96
2019-20, 2020-21 విద్యా సంవత్సరం కొవిడ్ కారణంగా అందరు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.			
2021-22	7,920	6,783	85.64

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినవుతా..



పది ఫలితాల్లో 10కి 10 గ్రేడ్ సాధించడం ఆనందంగా ఉంది. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు, బోధన, ప్రోత్సాహం వలనే ఈ మార్కులు సాధించగలిగా. మా తల్లితండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది. బాగా చదివి సాఫ్టవేర్ ఉద్యోగం సంపాదించడమే నా లక్ష్యం.

– సానియా, (10 జీపీఏ), జెడ్పీహెచ్ఎస్, ఉండవెల్లి

నాణ్యమైన ఫలితాలు



పది ఫలితాల్లో జిల్లా 27వ స్థానంలో నిలిచినప్పటికీ ఇవి నాణ్యమైనవిగా భావిస్తున్నాం. ఉత్తీర్ణత శాతం మెరుగుపడింది. భయపడాల్సిన, బాధపడాల్సిన అవసరం లేదు. వచ్చే విద్యా సంవత్సరం ఇంకా మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తాం.

– సిరాజుద్దీన్, డీఈఓ

21పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత

జిల్లా వ్యాప్తంగా 21 పాఠశాలల్లో వంద **శాతం ఉత్తీర్ణత** సాధించారు. ఇందులో **ప్రభుత్వ పాఠశా**లలు మూడు, సంక్షేమ **గురుకులాలు ఆ**యిదు, కేజీబీవీ రెండు, **రెసిడెన్షియనల్** పాఠశాల ఒకటి, ప్రైవేటు **పాఠశాలలు 10** ఉన్నాయి. మొత్తం ఏడు **పాఠశాలల నుం**చి 14 మంది విద్యార్థులకు 10/10 జీపీఏ పాయింట్లు వచ్చాయి. వీటిలో బీచుపల్లి రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పది జీపీఏ పాయింట్లు, గద్వాల విశ్వభారతి టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థులు అయిదు మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఉండవల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థినీ సానియా, గట్టు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినీ మనీషా, గద్వాల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి అల్తాఫ్ 10 జీపీఏ పాయింట్లు సాధించి సత్తాచాటారు. గురుకుల రీజినల్ కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్‌రాణి విద్యార్థుల ప్రతిభను కొనియాడుతూ అభినందించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



విద్యార్థి రేణుకను సన్మానిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని రేణుక (ఎంఎల్‌టీ) విభాగంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం పొందింది. బుధవారం కలెక్టరేట్‌లో ఆమె విద్యార్థిని రేణుకతో పాటు, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 30 మంది విద్యార్థులను అధ్యాపకులు, తల్లిదండ్రుల సమక్షంలో సన్మానించి అభినందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థిని రేణుక రాష్ట్రంలోనే ప్రథమ స్థానం పొందడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో పై చదువులు చదవాలని సూచించారు. జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి కలిపి 2068 మందికిగాను1107 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ప్రభుత్వ కళాశాల్లోని విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాములు, జిల్లా ఇంటర్మీడియెట్ కోఆర్డినేటర్ హృదయరాజు అధ్యాపకులు దేవేందర్‌రెడ్డి, వీరన్న, రాములు, శశిధర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

గద్వాల రూరల్: రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ఈనెల చివరి వరకు వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోళ్లు చేయాలని, కొనుగోలు చేసిన వెంటనే ధాన్యాన్ని తరలించాలని సూచించారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో వీలైనంత త్వరగా కేంద్రాల్లో కొనుగోలు చేయాలన్నారు. వచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు తప్పనిసరిగా దిగుమతి చేసుకోవాలన్నారు. మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మిల్లర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రైతులకు నష్టం జరగకుండా తప్పనిసరిగా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలన్నారు. ధాన్యం దిగుమతి విషయంలో ఎలాంటి అలసత్వం వహించకుండా, పూర్తి సహకారం అందించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ రాములు, పౌరసరఫరాల అధికారి రేవతి, జిల్లా మేనేజర్ ప్రసాద్ రావు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ

గద్వాల మండలంలోని అనంతపురంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, రైతులు వరి ధాన్యాన్ని తూర్పరబట్టి తాళ్లు లేకుండా కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 71కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, 70మంది రైతుల నుంచి 565మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఆనంతరం గద్వాల, అనంతపురం శివారుల్లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ రేవతి, ఏంపీపీ ప్రతాప్ గౌడ్, ఎంఆర్ఓ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు ఉన్నారు.

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



వడ్డేపల్లిలో మాట్లాడుతున్న ఎస్పీ కె.సృజన

శాంతినగర్: వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండడంతోపాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. అప్పుడే రోడ్డు ప్రమాదాల నివారించవచ్చని ఎస్పీ సృజన అన్నారు. వడ్డేపల్లిలో బుధవారం పోలీస్ కళాబృందం వారు నిర్వహించిన సామాజిక అవగాహన సదస్సుకు ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి, నిర్లక్ష్యంగా, హెల్మెట్ లేకుండా, దురుసుగా వాహనాలు నడపడం వల్ల చాలా వరకు రోడ్డు ప్రమాదాలు జరిగి వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. వాహనాలు జాగ్రత్తగా నడపాలని, మైనర్లకు ఇవ్వవదన్నారు. మహిళలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా 100, షీటీం నంబర్ 8712670312 కు కాల్‌చేయాలని సూచించారు. బాల్యవివాహాలు చట్టరిత్యా నేరమని, ఎవరైనా అలా చేయాలని ప్రయత్నిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ శివశంకర్‌గౌడ్, ఎస్ఐ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మెన్ కరుణ, వైస్ చైర్మన్ సుజాత, సురక్ష కళాబృందం పాల్గొంది.

పాత నేరస్తులపై నిఘా వుంచాలి

వార్షిక తనిఖీల్లో భాగంగా శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను ఎస్పీ కె.సృజన తనిఖీచేశారు. పాత నేరస్తులపై నిఘా వుంచాలన్నారు.

మానవపాడులో..

మానవపాడు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యలంలో మండలంలోని ఆయా గ్రామాల్లోని రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని ఎస్పీ సృజన తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. ఎస్ఐ సంతోష్, హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,110

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు బుధవారం 229 క్వింటాళ్ల వేరుశనగ రాగా క్వింటాకు గరిష్టం రూ.7110, కనిష్టం రూ. 3729, సరాసరి రూ. 6868 ధరలు లభించాయి. అలాగే, 124 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ.5419, కనిష్టం రూ. 3500, సరాసరి రూ. 5169 ధర పలికిండి. 3092 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ. 2041, కనిష్టం రూ.1431, సరాసరి రూ.1949 ధరలు వచ్చాయి.6క్వింటాళ్ల వరి (హంస)రాగా, గరిష్టం కనిష్టం, సరాసరిగా రూ.1,511 ధర పలికింది.

లక్ష్యం.. నిర్దేశం

- మార్కెట్‌యార్డులకు ఆదాయ లక్ష్యాలు ఖరారు
- గద్వాలకు రూ.5.28కోట్లు.. అలంపూర్‌కు రూ.2.16కోట్లు
- యార్డుల్లో లావాదేవీలు, ప్రభుత్వ ఏజెన్సీల నుంచి సెస్ రూపంలో ఆదాయం



గద్వాల మార్కెట్‌యార్డులో వరి ధాన్యాన్ని కాంటా వేస్తున్న హమాలీలు

గద్వాల వ్యవసాయం: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని మార్కెట్‌యార్డులకు ఆదాయ లక్ష్యాలను నిర్దేశించారు. ఈ ఏడాదిలో పంటలు బాగా పండి, యార్డుకు పంట ఉత్పత్తులు బాగా వస్తాయని యార్డు అధికారులు భావిస్తున్నారు. ఇక జిల్లాలో జూరాల, నెట్టెంపాడు, ఆర్డీఎస్ ప్రాజెక్టులు ఉండడంతో పాటు, ర్యాలంపాడు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్లు, 120 చెరువులు ఉన్నాయి. దీంతో ఇక్కడ వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉంది. ఏటా వానాకాలంలో 1.27లక్షల హెక్టార్లు, యాసంగిలో 48వేల హెక్టార్లలో వరి, పత్తి, కందులు, ఆముదం, మొక్కజొన్న తదితర పంటలు పండిస్తున్నారు. పండించిన పంట ఉత్పత్తులను విక్రయించేందుకు జిల్లాలో గద్వాల, అలంపూర్, అయిజలో మార్కెట్‌యార్డులు ఉన్నాయి. ఇందులో అలంపూర్ మార్కెట్‌యార్డుకు అయిజ సబ్‌మార్కెట్‌గా ఉంది.

ధాన్యం రాశులతో కళకళ

గద్వాల మార్కెట్ యార్డు ప్రాంగణం నిత్యం ధాన్యపు రాశులతో కళకళలాడుతుంటుంది. జిల్లాలోని రైతులతో పాటు, మక్తల్, ఆత్మకూర్, పెబ్బేరు, కొల్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి సైతం రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను విక్రయించేందుకు ఇక్కడికి తీసుకవస్తారు. ఇక అలంపూర్, అయిజ మార్కెట్ యార్డులలో రోజువారి పంట ఉత్పత్తుల కొనుగోళ్లు నిత్యం జరగవు. ప్రభుత్వ రంగ సంస్థల నుంచి మాత్రమే డిమాండ్ మేరకు కొనుగోళ్లు నిర్వహిస్తారు. అయితే ఈమార్కెట్ పరిధి కింద ఎర్రవల్లి, పుల్లూరు, అయిజలలో చెక్‌పోస్టులు ఉన్నాయి. ఈ చెక్‌పోస్టుల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయంపైనే అలంపూర్ మార్కెట్‌యార్డు కొనసాగుతోంది.


ఆదాయం సమకూరుతుందిలా..

మార్కెట్‌యార్డులలో రైతులు తీసుకొచ్చిన పంట ఉత్పత్తులను వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అలా వ్యాపారులు చేపట్టే లావాదేవీల (టర్నోవర్) ఆధారంగా మార్కెట్ యార్డుకు సెస్ చెల్లిస్తారు. ఇదే యార్డులకు ప్రధాన ఆదాయ వనరు. దీంతో పాటు పంట ఉత్పత్తులను కొనుగోలు చేసే మిల్లులు (ఆయిల్, జిన్నింగ్, రైస్‌మిల్లులు తదితరమైనవి) యార్డులకు సెస్ చెల్లించాల్సి ఉంటుంది. ఇక పంట ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తరిలించేటప్పుడు చెక్‌పోస్టుల వద్ద సంబంధిత యార్డులకు సెస్ చెల్లించాలి. ఇక ప్రభుత్వం తరపున ఎఫ్‌సీఐ, సీసీఐ, హాకా తదితర సంస్థలు యార్డులలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్దతు ధర అందిస్తూ పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తాయి. ఈసంస్థలు సైతం యార్డుకు సెస్‌ను చెల్లిస్తాయి.

ఈఏడాది లక్ష్యం

గద్వాల యార్డుకు సీజన్‌తో సంబంధం లేకుండా నిత్యం వేరుశనగ వస్తోందని, మార్కెట్ యార్డులు సొంతంగా ప్రభుత్వ మద్దతు ధరతో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తోందని, దీంతో పాటు చెక్‌పోస్టుల నుంచి సెస్ వస్తుంది. వీటన్నింటి వల్ల ఈసారి లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం సమకూరుతుందని యార్డు అధికారులు అంటున్నారు. ఈఏడాది వర్షాలు బాగా కురుస్తున్నాయన్న అంచనాలు ఉన్నాయని దీనివల్ల పంటలు బాగా పండి యార్డుకు పెద్ద ఎత్తున పంట ఉత్పత్తులు వచ్చే అవకాశం ఉందని, అదేవిధంగా పత్తి, కంది పంటలను జిల్లాలో బాగా వేస్తున్నారని, వీటిని కొనుగోలు చేసే ప్రభుత్వరంగ సంస్థల నుంచి సెస్ రూపంలో యార్డుకు ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

2023-24 లక్ష్యం వివరాలిలా..	
గద్వాల యార్డు లక్ష్యం : రూ.5.28 కోట్లు	
ఇందులో యార్డు నుంచి రూ. 3.00కోట్లు	ప్రభుత్వ ఏజెన్సీల నుంచి 2.03 కోట్లు
చెక్‌పోస్టుల నుంచి : రూ. 25లక్షలు	
అలంపూర్ మార్కెట్‌యార్డు లక్ష్యం రూ. 2.16 కోట్లు	
ఇందులో చెక్ పోస్టుల నుంచి రూ.1.01 కోట్లు	
యార్డు నుంచి రూ. 60లక్షలు	ప్రభుత్వ ఏజెన్సీల నుంచి రూ.55లక్షలు



గద్వాల యార్డు నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న హమాలీలు

తప్పక చేరుకుంటాం



2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఏజెన్సీల నుంచి సకాలంలో సెస్ రానందున గద్వాల యార్డు లక్ష్యాన్ని చేరుకోలేదు. అలంపూర్ యార్డు లక్ష్యాన్ని చేరుకుంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు యార్డులలో ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటాం. గద్వాల యార్డుకు నిత్యం వేరుశనగ వస్తోంది. చెక్‌పోస్టుల వద్ద సెస్ వసూలు చేస్తాం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను యార్డులు సొంతంగా నిర్వహిస్తున్నాయి. వీటన్నింటి వల్ల లక్ష్యం మేరకు ఆదాయం వస్తుంది.

– పుష్ప, జిల్లా మార్కెటింగ్ అధికారి

క్లుప్తంగా

పాము కాటుతో వ్యక్తి మృతి


శ్రీనివాసచారి (ఫైల్)

మల్దకల్: పాము కాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. అయిజ మండలంలోని ఉత్తనూరు చెందిన శ్రీనివాసచారి 25 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం మండల కేంద్రానికి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానికంగా వెల్డింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం తోటి స్నేహితులతో కలిసి కర్నూల్ జిల్లాలోని నందికొట్కూర్ వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో వ్యవసాయ పొలంలో పాము కాటు వేసింది. గమనించిన స్నేహితులు వెంటనే కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళ..

అచ్చంపేట: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన దొడ్ల నారమ్మ(55)గురువారం బైక్‌పై నుంచి పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామం నుంచి గుర్తు తెలియని వాహనంపై అచ్చంపేట వెళ్తుండగా బుద్దతండా వద్ద ప్రమాదం చోటు చేసుకున్నట్లు భర్త పర్వతాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

చెరువులో పడి యువకుడు..

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందిన ఘటన మంగళవారం చోటు చేసుకోగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్లకు చెందిన చటమోని సురేష్ (30)తన ఎద్దులను తీసుకుని కేసరి సముద్రం చెరువులో స్నానం చేయించేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మృతదేహం బుధవారం నీటిపై తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి అన్న బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం


సరిత (ఫైల్)

మానవపాడు: భర్త మద్యానికి బానిసై తనను పట్టించుకోవడం లేదని మనస్తాపం చెందిన భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని జల్లాపురంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. మానవపాడుకు చెందిన కె.సరిత (35), జల్లాపురం చెందిన మధుసూదన్‌కు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. భర్త మద్యానికి బానిసై కుటుంబం విషయంలో పట్టించుకోవడంలేదని సరిత మనస్తాపం చెంది బుధవారం ఉదయం జల్లాపురం గ్రామంలోని ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బావిలో యువకుడి మృతదేహం లభ్యం

మక్తల్: బావిలో యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణానికి రాఘవేందర్ (26) మంగళవారం తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ లొకేషన్ ద్వారా కుటుంబ సభ్యులు ఆరా తీయగా, సంగంబండ రిజర్వాయర్ పక్కన కాల్వ సమీపంలో ఓ బావి వద్ద సెల్‌ఫోన్, దుస్తులు, స్కూటీ ఉండటంతో బావిల్లో మృతదేహం కనిపించింది. గజ ఈతగాళ్ల సాయంతో బయటకు తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై సోదరుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

విద్యుదాఘాతంలో రైతుకు తీవ్రగాయాలు

బల్మూర్: వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రైతు ముచ్చర్ల లింగయ్య గ్రామ సమీపంలో వ్యవసాయం పొలం ఉంది. బుధవారం సాయంత్రం పొలంలో ఉన్న బోరు మోటారు స్టార్ట్ కాకపోవడంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా, కిందికి వేలాడి ఉన్న వైర్లు తగలడంతో కిందపడిపోయాడు. లింగయ్య రెండు చేతులు కాలి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని వెంటనే చికిత్స నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

వ్యక్తి రిమాండ్

బాలానగర్: అట్రాసిటీ కేసులో మండలంలోని ఎక్వాయపల్లి చెందిన వెంకట్‌రెడ్డిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపారు.

క్రీడాహబ్‌గా పాలమూరు

- పోతులమడుగులో అధునాతన మినీస్టేడియం
- రూ.3.65 కోట్లతో ఏర్పాటు
- కొనసాగుతున్న నిర్మాణ పనులు
- గ్రామీణ క్రీడాకారులకు అందుబాటులోకి..


పోతులమడుగులో కొనసాగుతున్న మినీస్టేడియం పనులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు జిల్లా క్రీడలకు హబ్‌గా మారుతోంది. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం స్టేడియాల పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రంలో పలు స్టేడియాల నిర్మాణాలు చేపడుతున్నారు. మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు చివరి దశకు చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలో ఎంవీఎస్ మైదానంలో రూ.2.65 కోట్లతో మినీ స్టేడియం పనులు చేస్తున్నారు.

పోతులమడుగులో మినీ స్టేడియం

జిల్లాలోని భూత్పూర్ మండలం పోతులమడుగులో అధునాతన మినీ స్టేడియం పనులు కొనసాగుతున్నాయి. గ్రామీణ క్రీడాకారులకు ఈ స్టేడియం ఒక వరంలా మారనుంది. ఎంతో సువిశాలమైన వాతావరణంలో దాదాపు ఆరు ఎకరాల్లో నిర్మాణం చేపడుతున్నారు. గతంలో పోతులమడుగు మినీ స్టేడియానికి మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. రూ.3.65 కోట్ల నిధులు దీనికి మంజూరయ్యాయి. కార్యాలయ బిల్డింగ్, షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ హాల్, టేబుల్ టెన్నిస్ హాల్, స్టోర్‌రూం పనులు చేస్తున్నారు.

ఆవరణలో అథ్లెటిక్స్ ట్రాక్..

మినీ స్టేడియం ఆవరణలో 200మీటర్ల అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ కోర్టులు నిర్మించనున్నారు. పోతులమడుగులో మినీ స్టేడియం పనులను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు. పనులు వేగవంతం అయ్యేలా తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు.


పనులను పరిశీలిస్తున్న డీవైఎస్‌ఓ శ్రీనివాస్ తదితరులు (ఫైల్)

చురుగ్గా పనులు..



పోతులమడుగులో నిర్మిస్తున్న మినీ స్టేడియం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు ఈ స్టేడియం అందుబాటులోకి వస్తే మరెన్నో సౌకర్యాలు లభిస్తాయి. ఇప్పటికే మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఎంవీఎస్‌లో మినీ స్టేడియం నిర్మాణమవుతోంది. ఈ స్టేడియాలు పూర్తయితే క్రీడాకారులకు మెరుగైన శిక్షణ లభిస్తుంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

నకిలీ బంగారం విక్రయ కేసులో ట్విస్ట్

- ఇద్దరు మహిళలపై నలుగురు లైంగికదాడి
- పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

జడ్చర్ల: నకిలీ బంగారం విక్రయించి మోసం చేసిన వ్యక్తులను రప్పించి పట్టుకున్న సంఘటనలో ఇద్దరు మహిళలపై నలుగురు లైంగికదాడికి పాల్పడిన విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోడ్గల్ శివారులో గల మలబార్ తోటలో ఏపీలోని పల్నాడు జిల్లా అచ్చంపేట ప్రాంతానికి చెందిన చెందిన లక్ష్మి కూలీగా పనిచేస్తుండేది. ఈ క్రమంలో జడ్చర్ల మండలం నెక్కొండకు చెందిన కాటమోని బాలస్వామి, లక్ష్మి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. రెండు నెలల కిందట లక్ష్మి అక్కడి నుంచి బాలానగర్ మండలం నేరళ్లపల్లి శివారులో గల మరో తోటలో పనిచేసేందుకు మారింది. ఈ నేపథ్యంలో తోటలో పనుల కోసం పల్నాడు ప్రాంతానికి చెందిన మహిళ రమణ, మరో వ్యక్తి రమేష్ కలిసి లక్ష్మి వద్దకు వెళ్లారు. ఈ సమయంలో లక్ష్మి, రమణ, రమేష్ కలిసి కాటమోని బాలస్వామికి రూ.2లక్షలు తీసుకుని అరకిలో నకిలీ బంగారు బిస్కెట్‌లను విక్రయించారు. ఆ తర్వాత లక్ష్మి తోటలోనే పనులు చేసుకుంటుండగా, రమణ, రమేష్ తమ ప్రాంతానికి వెళ్లిపోయారు. తాను కొనుగోలు చేసిన బంగారు బిస్కెట్‌లు నకిలీవని గుర్తించిన బాలస్వామి లక్ష్మిని నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. దీంతో లక్ష్మిని వెంటపెట్టుకుని తన మిత్రులు సహకారంతో మరింత బంగారం కొనుగోలు చేస్తామని నమ్మబలికి వారిని పల్నాడు ప్రాంతం నుంచి వెనక్కి రప్పించాడు. వారు కల్వకుర్తి శివారులోని జేపీ నగర్‌కు వచ్చేసరికి రమేష్, రమణ, వారితో పాటు వస్తున్న రమణ మేనత్త బయ్యా గంగమ్మను ఓ కారులో కిడ్నాప్ చేసి కోడ్గల్ శివారులోని మలబార్ తోటలోకి తీసుకువచ్చి ఓ గదిలో బంధించారు. తమ డబ్బులు తమకు ఇవ్వాలని కోరగా రమేష్ నిరాకరించాడు. బాలస్వామి, అతని స్నేహితులు వారిని తీవ్రంగా చితకబాదారు. అనంతరం మహిళ రమణపై బాలస్వామి, కుర్వ నర్సింహులు లైంగికదాడికి పాల్పడగా, మరో గదిలో బయ్యా గంగమ్మ చేతులు కట్టేసి వంశీ, శ్రీశైలం లైంగికదాడికి పాల్పడ్డారు. తమను కిడ్నాప్, లైంగికదాడికి పాల్పడిన వారితో పాటు లక్ష్మి, శేఖర్, కుమ్మరి గణేష్ ఉన్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళల నేత్రదానం

భూత్పూర్/పాలమూరు: భూత్పూర్ వద్ద మంగళవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగమణి, లక్ష్మమ్మల కార్నియాను(కళ్లను) సేకరించారు. మృతుల బంధువులు ఇద్దరి కళ్లదానం చేస్తామని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆ తర్వాత ఇండియన్ రెడ్‌క్రాస్ సహకారంతో హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి నుంచి కార్నియా సేకరణ నిపుణుడు శివకుమార్ వచ్చి కళ్లు సేకరించి ఆస్పత్రికి పంపించారు. కార్నియా దానం చేయడం వల్ల నలుగురికి చూపు వస్తుందని రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ తెలిపారు. జిల్లాలో ఎవరైనా నేత్రదానం చేయాలని భావించిన వారు 9666900900 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.


నేత్రదానం చేసినట్లు సర్టిఫికెట్ ఇస్తున్న వైద్యులు

120 క్వింటాళ్ల బియ్యం పట్టివేత


పొలంలో దాచిన బెల్లం సంచులు స్వాధీనం చేసుకుంటున్న ఎక్సైజ్ పోలీసులు

ఎర్రవల్లి చౌరస్తా: అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న డీసీఎంను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు కోదండాపురం ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా.. ఇటిక్యాల మండలంలోని ధర్మవరం నుంచి కొత్తకోటకు డీసీఎంలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో బుధవారం తెల్లవారుజామున విజిలెన్స్ అధికారులు కోదండాపురం సమీపంలో దాడులు చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. డీసీఎంను తనిఖీ చేయగా అందులో 240 ప్యాకెట్లు (120క్వింటాళ్లు) బియ్యం ఉన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మంగమ్మ గుర్తించి వాటిని పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. పరారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ నాగ మునీంద్రలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

3 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

బల్మూర్: మండల కేంద్రం సమీపంలోని పొలంలో బుధవారం సాయంత్రం అచ్చంపేట ఎక్సైజ్ అధికారులు, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 250 లీటర్ల బెల్లం పానకం, కుండలను ధ్వంసం చేశారు. నిల్వ చేసిన మూడు క్వింటాళ్ల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐలు బాల్‌రాజు, సతీష్‌కుమార్ తెలిపారు. సారా తయారీ స్థావరం ఏర్పాటు చేసిన రామావత్ పత్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రవాణా రంగ కార్మికులను ఆదుకోవాలి

పెంట్లవెల్లి: రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల మంది రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రామయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రవాణా రంగ కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలన్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం కేటాయించాలన్నారు. మరోవైపు అధికారుల వేధింపుల వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2019లో వచ్చిన మోటార్ వాహనాల చట్టం ప్రకారం కార్మికులకు పెను ప్రమాదంగా మారిందన్నారు. కార్యక్రమంలో దశరథం, నరేష్, నరసింహ, శ్రీనివాసులు, వినోద్, నరేష్, ఖలీల్, రాజు, మహేష్, బాలు, రవి తదితరులు పాల్గొన్నారు

మహిళ మెడలో నుంచి గొలుసు అపహరణ

వెల్దండ: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మట్ట లక్ష్మమ్మ కల్వకుర్తి పట్టణంలో ఆస్పత్రికి వెళ్లి బస్సులో వెల్దండ బస్టాండ్ చేరుకుంది. ఆమె నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా, గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్ వచ్చి మెడలో ఉన్న 4తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. మహిళ కేకలు వేయడంతో స్థానికులు వెంబడించినా ఫలితం లేకపోయింది. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె కుమారుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

బాలానగర్: మండలంలోని గౌతాపూర్‌నకు చెందిన బర్రె కృష్ణయ్య (37) మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపారు.

కర్నూల్ వాసి..

జడ్చర్ల: పట్టణ సమీపంలో జాతీయరహదారిపై రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కర్నూల్ జిల్లా గణేష్‌నగర్‌కు చెందిన మద్దెల వాసు(19) కర్నూల్‌లో సెకండ్ హ్యాండ్ బైక్‌ల విక్రయ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి మంగళవారం తన సెకండ్ హ్యాండ్ బైక్‌పై జడ్చర్ల వైపు వస్తున్న సమయంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన వాసును చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి సోదరుడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దేవసూగూర్ చెందిన వ్యక్తి..

కృష్ణా: మండలంలోని కృష్ణానది బ్రిడ్జి సమీపంలో మంగళవారం సాయంత్రం ఆటో, లారీ ఢీ కొన్న ఘటనలో హనుమప్ప(55) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ విజయబాస్కర్ బుధవారం తెలిపారు. మంగళవారం కర్ణాటకలోని దేవసూగూర్‌కు చెందిన హనుమప్ప, గోపాల్, ఉలిగప్ప, గంగాధర్ ఆటోలో నల్లుగట్టు మారెమ్మ గుడికి వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో బ్రిడ్జి సమీపంలో బూడిదలారీ ఢీ కొట్టడంతో హనుమప్ప చికిత్స పొందుతూ మృతి చెందగా, మిగిలిన వారికి గాయాలయ్యాయని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

‘పది’ పాసయ్యాయని స్వీట్లు పంచి..

- అంతలోనే ఇంట్లో ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించానని అందరికీ స్వీట్లు పంపిణీ చేసింది. ఆ తర్వాత ఇంట్లో అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని కన్పించింది. వన్‌టౌన్ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కురిహిశెట్టి కాలనీకి చెందిన బాలిక బుధవారం మధ్యాహ్నం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 8.2జీపీఏ సాధించింది. దీంతో ఇంట్లో వారితో పాటు స్నేహితులకు స్వీట్లు పంపిణీ చేసింది. ఆ తర్వాత ఫోన్ తీసుకుని ఫస్ట్ ఫ్లోర్‌కి వెళ్లి ఉరేసుకుంది. ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. దీనిపై ఇంకా ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ వెల్లడించారు.

తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీ

జడ్చర్ల: మండలంలోని బూర్గుపల్లితండాలో తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు సీఐ రమేష్‌బాబు బుధవారం తెలిపారు. తండాకు చెందిన నెనావత్ మహేందర్ తన కుమారుడికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో మంగళవారం ఇంటికి తాళం వేసి ఏనుగొండలోని ఆస్పత్రికి వెళ్లారు. బుధవారం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం విరగొట్టి బీరువాలోని తులంనర బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. పక్కనే ఉన్న నేనావత్ శ్రీనివాస్ ఇంట్లో కూడా బీరువాలో ఉన్న 30 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లైంగికదాడికి యత్నించిన లారీ డ్రైవర్ అరెస్ట్

మాగనూర్: బాలికపై లైంగికదాడికి యత్నించిన లారీ డ్రైవర్‌ను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకద్ర మండలానికి చెందిన బాలిక, పెద్దరాజమూర్ చెందిన వెంకటేష్ ఈ నెల 5వ తేదీన ప్రేమ వివాహం చేసుకుందామని ఇంట్లో పారిపోయారు. ఈ క్రమంలో ఓ లారీలో ఎక్కగా, డ్రైవర్ మాగనూర్ సమీపంలో బాలికపై లైంగికదాడికి యత్నించాడు. బాలిక భయపడి లారీలో నుంచి బయటకు దూకి తీవ్రంగా గాయపడింది. ఆమెను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా లారీ డ్రైవర్ రాయచూర్ నుంచి మాగనూర్ వైపు వస్తుండగా స్థానిక పోలీస్టేషన్ వద్ద ఆపి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. డ్రైవర్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మహరాజ్‌గంజ్ చెందిన మనోజ్‌యాదవ్‌గా గుర్తించామని, ఈ కేసులో ఏ–2 గా ఉన్న డ్రైవర్‌ను నారాయణపేట కోర్టులో హాజరుపర్చగా అతడిని మహబూబ్‌నగర్ జైలుకు తరలించారు. ఏ–1 గా ఉన్న వెంకటేష్ పరారీలో ఉన్నాడని తెలిపారు.

పాతికేళ్ల తర్వాత కుటుంబం చెంతకు...

- నారాయణపేట జిల్లా వాసిని అప్పగించిన ‘అన్నం’ ఫౌండేషన్


శ్రీనును తల్లికి అప్పగించిన అన్నం శ్రీనివాసరావు

ఖమ్మం అర్బన్: మతిస్థిమితం లేని వ్యక్తిని పాతికేళ్ల తర్వాత ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన తల్లి చెంతకు చేర్చారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మంతన్‌గోడ్ గ్రామానికి చెందిన కొల్లూరి శ్రీనుకు మతిస్థిమితం లేకపోవడంతో 25 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అక్కడక్కడా తిరుగుతూ ఖమ్మం చేరుకున్న ఆయన ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుండడంతో పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. అక్కడ వైద్యం అందించడంతో కోలుకున్న శ్రీను తర వివరాలు వెల్లడించడంతో మక్తల్ సీఐకి సమాచారం ఇచ్చారు. అయితే, శ్రీను తండ్రి కొన్నాళ్ల క్రితం చనిపోగా.. తల్లి ఆర్థిక పరిస్థితి బాగాలేక ఖమ్మం వచ్చే పరిస్థితి లేదని తెలిపింది. దీంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు కొల్లూరి శ్రీనును బుధవారం తీసుకెళ్లి తల్లి పోలమ్మ, బంధువులకు అప్పగించగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి

గద్వాల క్రైం: బైక్ డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాఘవేంద్రకాలనీకి చెందిన వీరేష్ (30) పని నిమిత్తం బైక్‌పై మంగళవారం ఎర్రవల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బుధవారం తెల్లవారుజామున గద్వాలకు వస్తుండగా కలెక్టరేట్ సమీపంలో బైక్‌ను నిర్లక్ష్యంగా నడుపుతూ రోడ్డు డివైడర్‌కు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వీరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామస్వామి తెలిపారు.

ధాన్యం కుప్పను ఢీకొని..

లింగాల: మండలంలోని రాంపూర్ బస్ స్టేజీ సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తెలకపల్లికి చెందిన బాల్ లక్ష్మయ్య(45) మృతి చెందాడు. మృతుడు మండలంలోని సూరాపూర్ నుంచి బైక్‌పై తెలకపల్లికి బయలుదేరాడు. కొంత మంది రైతులు వరి ధాన్యాన్ని రోడ్డుపై ఆరబోసి రాత్రి సమయంలో కుప్పగా చేసి నల్లటి కవర్‌ను కప్పారు. రాత్రి కుప్ప కనిపించకపోవడం బైక్‌తో ఢీకొట్టి అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న డీసీఎం

- క్లీనర్ మృతి

పెబ్బేరు: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని డీసీఎం ఢీకొనడంతో క్లీనర్ నూర్ హమ్మద్ (22) మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కడప జిల్లా రాజంపేట నుంచి సంగారెడ్డికి అరటి లోడ్ లారీలో తీసుకెళ్తుండగా పెబ్బేరు సమీపంలో సందర్శిని హోటల్ వద్ద ఆగింది. పాత బ్యాటరీలను హైదరాబాద్‌కు తీసుకెళ్తున్న డీసీఎం వెనుక నుంచి ఆగిన ఉన్న లారీని ఢీకొట్టింది. డీసీఎంలో ఉన్న క్లీనర్ నూర్‌హమ్మద్ క్యాబిన్ నుంచి అద్దాలు పగిలి బయటకు పడ్డాడు. అతనికి రెండు కాళ్లు విరిగి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని తల్లి షాహన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు.

ఎస్సెస్సీ ఫలితాల్లో ‘రిషి’ విజయ దుందుభి


విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రిషి పాఠశాల విద్యార్థులు ఎస్సెస్సీ ఫలితాల్లో విజయదుందుభీ మోగించారు. పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు 10జీపీఏ సాధించారు. ఏడుగురు 9.8జీపీఏ, 11 మంది 9.7జీపీఏ, 71 మంది 9 జీపీఏ, వందశాతం ఉత్తీర్ణత సాధించారు. 10జీపీఏ సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. చైర్మన్ చంద్రకళావెంకటయ్య మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మంచి ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పూజితా మోహన్‌రెడ్డి, కోశాధికారి పూజితా ప్రవీణ్, సుశాంత్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘రెయిన్‌బో’ విద్యార్థుల విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మమత తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాల విద్యార్థులు ఎస్సెస్సీ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. ఇందులో ముగ్గురు విద్యార్థులకు 10జీపీఏ, ఏడుగురికి 9.8, ముగ్గురికి 9.7, నలుగురికి 9.5, ముగ్గురికి 9.3, నలుగురికి 9.2, ఒకరికి 9 జీపీఏ వచ్చింది. ఈమేరకు 74శాతం మంది 8జీపీఏలకు పైగా సాధించినట్లు ప్రిన్సిపాల్ మమత ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

అకాల వర్షాలతో పంట నష్టం

● రైతు ఆత్మహత్య


రాజు (ఫైల్)

టేకుమట్ల(రేగొండ): అకాల వర్షాలతో పంట నష్టం, అప్పుల బాధ తాళలేక ఒక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో బుధవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు అందించిన వివరాలివి. తిరుమలగిరి గ్రామానికి చెందిన రైతు సుంకరి రాజు (35) తనకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ ఏడాది మిర్చి తోట వేయగా అకాల వర్షాలకు పంట దెబ్బతింది. పంట కోసం చేసిన అప్పులు తాళలేక మంగళవారం తన ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఉపాధికి రక్షణ కవచం!

ఏపీలోని పాల సముద్రం వద్ద బీఈఎల్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్

- 914 ఎకరాల్లో ఐదు దశల్లో నిర్మాణం
- రాడార్లు, మిస్సైల్, సబ్‌మెరైన్ పరికరాల తయారీ, టెస్టింగ్
- తొలి దశలో రూ.384 కోట్లతో యూనిట్
- స్థానిక యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఎంఓయూతో చేతులు దులిపేసుకున్న గత సర్కారు
- పట్టుబట్టి పరిశ్రమ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకున్న ప్రస్తుత ప్రభుత్వం



సాక్షి, అమరావతి : పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. ఓ వైపు పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు.. మరో వైపు సెజ్ (స్పెషల్ ఎకనామిక్ జోన్)లు, వాటిలో భారీ పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వీటికి అనుబంధంగా ఏర్పాటయ్యే పరిశ్రమల ద్వారా లక్షల సంఖ్యలో యువతకు ఉపాధి మార్గాలు చేరువ కానున్నాయి. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లా పాల సముద్రం వద్ద 914 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగానికి చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్ పనులు వేగం అందుకున్నాయి. ఐదు దశల్లో ఈ యూనిట్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే తొలి దశలో రూ.384 కోట్లతో అభివృద్ధికి బోర్డు ఆమోదం తెలిపింది. త్వరలో జరిగే బోర్డు సమావేశంలో మిగిలిన దశలకు సంబంధించి ఆమోదం లభించనుందని బీఈఎల్ అధికారులు తెలిపారు. ఈ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్‌లో రాడార్, మిస్సైల్, సబ్‌మెరైన్లకు సంబంధించిన పరికరాలను అభివృద్ధి చేయడమే కాకుండా వీటిని పరీక్షించేలా టెస్టింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. తొలి దశకు సంబంధించి క్షిపణుల అసెంబ్లింగ్, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ కార్యకలాపాలకు అవసరమైన మౌలిక వసతులను రూ.148 కోట్లతో అభివృద్ధి చేయడానికి ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది.

డిఫెన్స్ హబ్‌గా ఏపీ

దేశ రక్షణ అవసరాల తయారీ హబ్‌గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి తెలిపారు. ఇప్పటికే కేంద్ర రక్షణ సంస్థ 914 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్ అభివృద్ధి చేస్తుండగా ఏపీఐఐసీ కూడా 1,200 ఎకరాల్లో ఏపీ ఎయిరో స్పేస్ అండ్ డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ (ఏపీ–ఏడీఈ) పార్క్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి త్వరలో జరిగే ఏపీఐఐసీ బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నామని చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టుల రాకతో శ్రీ సత్యసాయి జిల్లాతోపాటు రాష్ట్రం రక్షణ రంగ ఉత్పత్తులకు తయారీ కేంద్రంగా తయారవుతుందన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల రాకతో ప్రత్యక్షంగా 2,800 మందికి, పరోక్షంగా 8,000 మంది వరకు ఉపాధి లభిస్తుంది. యాంకర్ యూనిట్‌గా బీఈఎల్ భారీ ప్రాజెక్టును చేపడుతుండటంతో అనేక అనుబంధ కంపెనీలు, ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు కానున్నాయి.

చకచకా అనుమతులు

గత ప్రభుత్వ అసమర్థ నిర్వాకానికి బీఈఎల్ ప్రాజెక్టు ఒక ఉదాహరణ. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన క్షిపణులు, ఇతర రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి 2016లోనే బీఈఎల్ ముందుకు రాగా, రాష్ట్ర ప్రభుత్వ అలసత్వంతో ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. భూమి కన్వర్షన్, పర్యావరణ అనుమతులు తేవడంలో అప్పటి ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంతో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించి, త్వరితగతిన అనుమతులు వచ్చేలా చర్యలు చేపట్టారు.


బుధవారం నల్సార్ యూనివర్సిటీలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ నవీన్‌రావు. చిత్రంలో వీసీ కృష్ణదేవరావు, జడ్జి గోవర్ధన్‌రెడ్డి, రిజిస్ట్రార్ విద్యుల్లత, సునీల్‌కుమార్ తదితరులు

రైతులకు చట్టాలపై అవగాహన కల్పించాలి

- అందులో వలంటీర్లది కీలక పాత్ర: జస్టిస్ నవీన్‌రావు
- 67 ప్రాంతాల్లో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ఏర్పాటు
- సాగు చట్టాలపై శిక్షణ కార్యక్రమం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రైతులకు భూమి, నీరు, క్రిమిసంహారక మందులు, మార్కెటింగ్ చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు పిలుపునిచ్చారు. రైతులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 176 పారా లీగల్ వలంటీర్లను నియమించిందని వెల్లడించారు. గ్రామీణ భవితకు వలంటీర్లు మార్గదర్శకులు కావాలన్నారు. సాగు చట్టాలపై వలంటీర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నల్సార్ యూనివర్సిటీలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ నవీన్‌రావు మాట్లాడుతూ.. 'దేశంలోని రైతుల్లో పేద, మధ్య తరగతి వారే ఎక్కువ. వారికి చట్టాలపై అవగాహన తక్కువ. న్యాయం పొందడం వారి హక్కే అయినా కోర్టులకు వెళ్లి దాన్ని పొందాలంటే ఆర్థిక భారంతో కూడిన పని. కోర్టు గ్రామ స్థాయికి వెళ్లి న్యాయం అందించలేని పరిస్థితి. అందుకే ఇలాంటి వారి కోసం న్యాయ సేవా సంస్థలు ఆవిర్భవించాయి. వారికి న్యాయసేవలు అందించడమే వలంటీర్ల బాధ్యత. దీని కోసం పుట్టిందే 'అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్'. బమ్మెరలో రెండు నెలల క్రితం ప్రారంభించాం. ఇప్పుడు 67 ప్రాంతాల్లో ఇవి ఏర్పాటయ్యాయి. తర్వాత మరిన్ని ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రెండు రోజుల పాటు జరిగే శిక్షణలో మీకు తెలియనివి నిపుణుల నుంచి తెలుసుకోండి. ప్రతీ చిన్న విషయానికి కోర్టులను ఆశ్రయించకుండా.. గ్రామీణ స్థాయిలో పరిష్కారం అయ్యేలా చూడాలి. మీరు పరిష్కరించలేని సమస్య వచ్చినప్పుడు మండల, జిల్లా, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చు'అని సూచించారు.

వారియర్లలా పని చేయాలి...

సత్వర న్యాయం అందించేందుకు వలంటీర్లు వారియర్లలా పనిచేయాలని నల్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు సూచించారు. పూర్వం నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 'మధ్యవర్తిత్వం' సంప్రదాయాన్ని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టాలు, పథకాలపై వలంటీర్లకు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ(టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ) సభ్యకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ విద్యుల్లత, లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ ప్రెసిడెంట్ సునీల్ కుమార్, రిసోర్స్ పర్సన్లు, ట్రైనీ పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

గుడాటిపల్లి నిర్వాసితుల ఇళ్ల కూల్చివేత

బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారని ఆరోపణ

అక్కన్నపేట (హుస్నాబాద్): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లి వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి జలాశయం పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇళ్లు ఖాళీ చేయాలని రెండు రోజులుగా గుడాటిపల్లి వాసులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. జలాశయంలో మొత్తం 687 ఇళ్లు ముంపునకు గురికాగా, నిర్వాసితులు ఇప్పటికే 655 ఇళ్లు ఖాళీ చేశారు. మరో 32 ఇళ్లలో బుధవారం సాయంత్రం 26 ఇళ్లను పోలీసుల పహారా మధ్య రెవెన్యూ అధికారులు కూల్చివేసి నిర్వాసితులను తరలించారు. రాత్రి మిగిలిన మొత్తం ఇళ్లను కూల్చేయనున్నారు. పరిహారం ఇవ్వకుండా బలవంతంగా ఇళ్లు ఖాళీ చేయిస్తున్నారని నిర్వాసితులు ఆరోపించారు. గ్రామస్తులను భయపెట్టి ఇళ్లను కూల్చుతున్నారని సర్పంచ్ బద్దం రాజిరెడ్డి ఆరోపించారు.

భూ నిర్వాసితుడి ఆత్మహత్యాయత్నం

గుడాటిపల్లి గ్రామానికి చెందిన భూ నిర్వాసితుడు బద్దం మల్లారెడ్డి బుధవారం సాయంత్రం డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకున్నారు. నిర్వాసితుడైన మల్లారెడ్డి తల్లికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం, మల్లారెడ్డికి 20 గుంటల భూమికి పరిహారం రావల్సి ఉంది. మనస్తాపానికి గురైన మల్లారెడ్డి.. పరిహారం చెల్లించకుండా ఇళ్లు ఖాళీ చేయడం ఏమిటని పోలీసులను ప్రశ్నిస్తూ ఒంటిపై డీజిల్ పోసుకున్నాడు. దీంతో పోలీసులు నిర్వాసితుడిని స్నానం చేయించి తొలుత పోలీస్‌స్టేషన్‌కు.. అనంతరం ఇంటికి పంపించారు.


గుడాటిపల్లిలో ఇళ్లను ఖాళీ చేసి సామాన్ల తరలింపు

జగిత్యాల జిల్లాలో హైకోర్టు న్యాయమూర్తుల పర్యటన


హైకోర్టు న్యాయమూర్తి ఈవీ.వేణుగోపాల్ నివాసంలో హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా జడ్జి, కలెక్టర్, సీపీ

బీరప్ప ఉత్సవాలకు హాజరు
కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు

జగిత్యాలజోన్/కరీంనగర్ క్రైం: హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు బుధవారం జిల్లాలో పర్యటించారు. జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధ, జస్టిస్ ఎం.లక్ష్మణ్, జస్టిస్ ఎస్.తుకారాంజీ, జస్టిస్ పి.మాధవిదేవి, జస్టిస్ సూరపల్లి నంద, జస్టిస్ అనుపమ చక్రవర్తి(అడ్మినిస్ట్రేటివ్ జడ్జి), జస్టిస్ ఎ.సంతోష్‌రెడ్డి, జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ కె.శరత్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు, జస్టిస్ శ్రవణ్‌కుమార్ తదితరులు తొలుత హైదరాబాద్ నుంచి ప్రత్యేక ఎస్కార్ట్‌తో కొండగట్టు చేరుకున్నారు. అంజన్నను దర్శించుకుని కాసేపు ఆలయ అతిథి గృహంలో సేదతీరారు. ఆ సమయంలో జగిత్యాల బార్ అసోసియేషన్ సభ్యులు వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి పుల్ల కార్తీక్ ఆహ్వానం మేరకు జగిత్యాలలో జరిగిన బీరప్ప ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, సబ్ జడ్జి ప్రసాద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనిజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపల్లి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కోశాధికారి కట్కం చంద్రమోహన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అక్కడ్నుంచి హైకోర్టు న్యాయమూర్తులు కరీంనగర్‌లోని హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్ నివాసానికి చేరుకున్నారు. అక్కడ వీరికి జిల్లా జడ్జి బి.ప్రతిమ, కలెక్టర్ ఆర్వీ కర్ణన్, సీపీ ఎల్.సుబ్బారాయుడు ఘన స్వాగతం పలికారు.

ధాన్యానికి నిప్పు పెట్టి హైవేపై రైతుల నిరసన

స్టేషన్‌ఘన్‌పూర్: రైస్‌మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై తమ జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపిస్తూ జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం రైతులు ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి, మిల్లర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు నీల గట్టయ్య, గాండ్ల రాజు, గాండ్ల శోభన్‌బాబు తదితరులు విలేకరులతో మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రోజు హమాలీలు బస్తాకు 41 కిలోల 300 గ్రాములు కాంటా వేస్తున్నారని తెలిపారు. ధాన్యం నాణ్యత లేదనే సాకుతో మిల్లర్లు బస్తాలో 42 కిలోలే పెట్టాలని కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా ఘన్‌పూర్ ఐకేపీ సెంటర్‌లో కొనుగోళ్లు కావడంలేదని, తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెబుతుండగా మిల్లర్లు,అధికారులు కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ధర్నాకు వైఎస్సార్‌టీపీ జిల్లా నాయకుడు ఊరడి శ్రీనివాస్ హాజరై మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపచేశారు.


జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న రైతులు

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ రూరల్: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పరిధిలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రంలో ఖాళీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ జి.రవినాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. స్పెషలిస్ట్ ఇన్ ఫైనల్ లిటరసీ ఒకటి, ఎంటీఎస్ ఒక పోస్టు ఖాళీగా ఉందని, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిగ్రీలో ఎకనామిక్స్, బ్యాంకింగ్ అర్హత కలిగి ఉండాలని, పీజీ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ఎంటీఎస్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే వారు గుర్తింపబడిన బోర్డు నుంచి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 2022 జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, అభ్యర్థులు దరఖాస్తుతో పాటు అన్ని ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో గజిటెడ్ అధికారిచే ధ్రువీకరించి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారి రూమ్ నంబర్ 36, సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవనంలో ఈనెల 22 సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని కలెక్టర్ కోరారు. అభ్యర్థులు వారి దరఖాస్తులు http:mahabubnagar.telangana.gov.in/recruitments/http://mbnrgov.in/dhew ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పాత కలెక్టరేట్ ఫర్నీచర్ వేలం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాత కలెక్టరేట్ కూల్చివేత తర్వాత అందుబాటులో ఉన్న టేకు, ఇతర కలపతో చేయబడిన తలుపులు, కిటికీలు, ఇతర ఫర్నీచర్ వేలం వేయనున్నట్లు కలెక్టర్ రవినాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. కొనుగోలుదారులు దరఖాస్తు నిమిత్తం రూ.200, ఈఎండీ నిమిత్తం రూ.15వేల డీడీని తీసి ఈనెల 12 నుంచి 22 వరకు దరఖాస్తుఫారాలను కలెక్టరేట్‌లోని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ద్వారా పొందవచ్చని వెల్లడించారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఐడీఓసీ లోని కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు ఈ నెల 22 సాయంత్రం 5 గంటల లోగా సమర్పించాలని తెలిపారు. కొనుగోలుదారులు పాత కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఫర్నీచర్‌ను స్వయంగా పరిశీలించుకోవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం 9000101505 నంబర్‌కు కార్యాలయ సమయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఉల్లి రైతుల నిరాశ

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి వేలంలో వచ్చిన ధరలు రైతలను నిరాశలో ముంచెత్తాయి. సీజన్ ప్రారంభమైన తర్వాత ఒక్కసారిగా తగ్గిన ధరలు అలాగే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఆరబెట్టిన నాణ్యమైన ఉల్లి మార్కెట్‌కు వచ్చినా ధర పెరగలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమైన ఉల్లి సీజన్ నాలుగు నెలలుగా కొనసాగుతుంది. ప్రస్తుతం సీజన్ ముగిసే సమయం దగ్గరపడుతున్నా ధరలలో మాత్రం మార్పులేదు. మార్కెట్‌కు బుధవారం దాదాపు వెయ్యి బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. మార్కెట్ బయట దాదాపు 500బస్తాల ఉల్లిని రైతులు సొంతంగా విక్రయాలు సాగించారు.

క్వింటాల్ ఉల్లి ధర రూ.1,100

మార్కెట్ యార్డులో నిర్వహించిన వేలంలో ఉల్లి ధర గరిష్ఠంగా రూ.1,100 వరకు పలికింది. కనిష్ఠంగా రూ.600 వరకు వచ్చింది. ఇక చిన్నపేడు ఉల్లి క్వింటాల్ రూ.300 వరకు పలికింది. మార్కెట్‌లో నాణ్యమైన ఉల్లి రావడం వల్ల వినియోగదారులు పెద్ద ఎత్తున్న కొనుగోలు చేశారు. ధరలు తక్కువగా ఉండడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వినియోగదారులు బస్తాలుగా కొన్నారు. మార్కెట్ బయట 50 కేజీల ఉల్లి బస్తాలను రూ.500 వరకు విక్రయించారు. మార్కెట్‌లో 45 కేజీల బస్తాను రూ.550 నుంచి రూ.500 వరకు అమ్మకాలు సాగించారు. రెండో రకం ఉల్లి రూ.300 వరకు బస్తాగా, చిన్నపేడు ఉల్లిని రూ. 150 బస్తాగా విక్రయించారు. చిరు వ్యాపారులు, బయట ప్రాంతాల వ్యాపారులు సైతం ఉల్లిని కొనుగోలు చేసి తరలించారు. మార్కెట్‌లో ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది.


దేవరకద్ర మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన ఉల్లి

సాహిత్యంతోనే ఉద్యమాలకు ఉపదేశం

● విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డా.డీఎస్‌ఆర్.రాజేందర్‌సింగ్

బిజినేపల్లి: సాహిత్యం సమాజానికి ఆనందంతో పాటు ఉద్యమాలకు ఉపదేశాన్ని బోధిస్తుందని, ప్రతి ఉద్యమంలో సాహిత్యం సమాజానికి నైతిక మార్గంలో నడిపిస్తుందని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డా.డీఎస్‌ఆర్. రాజేందర్‌సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు సాహిత్యంలో ఉత్పత్తి వృత్తులు – అధ్యాయనం అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ కంటే ముందు వేల సంవత్సరాలు ఈ సమాజాన్ని బతికించింది ఉత్పత్తి వృత్తులేనని, ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలో ఆ వృత్తులు దెబ్బతిన్నాయన్నారు. ప్రతి వృత్తిలో శారీరక శ్రమ, నైపుణ్యంతో కూడా శాస్త్రీయతను కలిగి ఉంటాయని, కుమ్మరి చక్రం, నాగలి, బండి చక్రం, సుత్తి, కొడవలి వంటి అద్భుతమైన ఆవిష్కరణలున్నాయన్నారు. దేశంలో అధిక జనాభా ఉండటం వలన వృత్తులను కొనసాగించాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ అధ్యక్షుడు ప్రొ.కాశీం అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, మైసూర్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు బి.వెంకటేశ్వర్లు, రాజారత్నం, కళాశాల అధ్యాపకులు కృష్ణయ్య, నాగరాజు, సుష్మ, శివ, రాధాకుమారి, స్వప్న, నాగలింగం, రామకృష్ణ, గోవిందు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ డా. డీఎస్‌ఆర్.రాజేందర్‌సింగ్

రెండు దశాబ్దాలు దాటినా... మరమ్మతుకు నోచుకోలే..



నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని కిష్టంపల్లి శివారులో ఉన్న సున్నపురాళ్ల కుంట మరమ్మతుకు నోచ్చుకోవడం లేదు. 20 ఏళ్ల నుంచి ఈ కుంటకు పడ్డ గండిని మరమ్మతు చేయకపోవడంతో వర్షపునీరు వృథాగా పోతుంది. ఈ కుంట కింద 70 ఎకరాల ఆయకట్టు ఉంది. కొందరు రైతులు సున్నపురాళ్లకుంట ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని అక్కడి రైతులు ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సున్నపురాళ్లకుంటకు మరమ్మతు చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. – మరికల్

పార్టీలకతీతంగా హక్కుల కోసం పోరాడుదాం

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్టీలకతీతంగా హక్కుల కోసం పోరాడుదామని ప్రజాసంఘాలు, సామాజిక సంఘాల ముస్లిం ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో బుధవారం 'ముస్లింల గోస–ధూంధాం ముచ్చట' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 8ఏళ్ల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం రూ.లక్షల కోట్లు ఖర్చు చేసిందని, ముస్లింలకు కేవలం రూ.12వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్ర హోం శాఖ మంత్రి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటే రాష్ట్రంలోని ఏ ఒక్క ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింల 12 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం మరిచిపోయిందని విమర్శించారు. మహబూబ్‌నగర్‌ను నిర్మించిన మీర్ మహెబూబ్‌అలీఖాన్ స్మారక మందిరానికి 100 గజాల స్థలం కూడా కేటాయించలేదన్నారు. సమైక్య రాష్ట్రంలో జిల్లా కేంద్రంలో నిర్మించిన షాదీఖానా ఉర్దూఘర్‌ను స్టోర్‌రూంగా మార్చడం సరికాదన్నారు. ముస్లింల సమస్యల పరిష్కారం కోసం పార్టీలకతీతంగా ఏకమవుదామని పిలుపునిచ్చారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ముస్లింల ఆత్మగౌరవ భవనాలు, షాదీఖానాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన ముస్లింలకు బడ్జెట్ కేటాయించాలన్నారు. త్వరలో జిల్లా కేంద్రంలో భారీస్థాయిలో ముస్లింలగోస బహిరంగసభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో తెలంగాణ ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, సామాజిక వేత్త హనీఫ్ అహ్మద్, టీఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం.ఖలీల్, ఇష్రత్‌అలీ, మహ్మద్ అయూబ్, మహ్మద్ సాధిక్, సమద్‌ఖాన్, ఇమ్రాన్, నూరుల్ హసన్, ఖయ్యూం, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్

సన్మాన్ పథకంపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న దేవి సిద్దార్థ

జడ్చర్ల టౌన్: తపాలా శాఖలో ప్రవేశపెట్టిన సన్మాన్ సేవింగ్ ఖాతాల గురించి గ్రామాల్లో మహిళలకు వివరించాలని వనపర్తి పోస్టల్ సూపరింటెండెంట్ దేవి సిద్దార్థ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన తపాలా శాఖ గ్రామీణ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ల శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ముఖ్యంగా సన్మాన్ సేవింత్ ఖాతా విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రూ. వెయ్యి నుంచి రూ.2లక్షల వరకు రెండేళ్లపాటు పొదుపు చేసుకునే సదుపాయం ఉందని మహిళలకు వివరించాలన్నారు. ఇందులో 7.5 శాతం వడ్డీ ఉంటుందన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్న వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. గత ఏడాది ప్రతిభ కనబరిచిన పోస్టుమాస్టర్లకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మేనేజర్ జుబేర్, గోరఖ్ నాథ్, యశస్వి పాల్గొన్నారు.

కేవీకేలో కంది, పెసర, మినుము విత్తనాలు

బిజినేపల్లి: మండలంలోని పాలెం కేవీకేలో కంది, పెసర, మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కో ఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. కందిలో పీఆర్‌జీయ–176 కేజీ విత్తనం రూ.130, పెసర డబ్ల్యూజీజీ–42 కేజీ రూ.115, మినుము జీబీజీ–1 కేజీ రూ.130 విక్రయించనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు 9912604549, 9494431405 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

12న టీజీఓ భవన నిర్మాణానికి భూమి పూజ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణ గెజిటెడ్ అధికారులు సంఘం భవన నిర్మాణానికి 12వ తేదీన స్థానిక ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో భూమి పూజ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి ఇస్తున్న ఇన్‌ఫ్లో మరింత తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి కేవలం 1,004 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, 6.096 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 113 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.